A1TV NEWS

ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 36 బుధవారం 02 08-2023 ఆగస్టు పేజీలు 4. వేల :4 /

# రౌడీయిజం చేస్తే తాటతీస్తా

## - చంద్రబాబు హెచ్చరికలు

**(వైసీపీ పాలనలో నియోజకవర్గానికో సైకో తయారవుతున్నాడన్న చంద్రబాబు**

**రోడ్డుకు మట్టి వేయలేరు.. 3 రాజధానులు కడతారట అంటూ ఎద్దేవా**

**వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప న్యాయం జరగదని వ్యాఖ్య**

**ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా నంద్యాల జిల్లాలో పర్యటన**



వైసీపీ పాలనలో నియోజకవర్గానికో సైకో తయారవుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. రౌడీయిజం చేస్తే తాటతీస్తానని హెచ్చరించారు. ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ఈ రోజు నంద్యాల జిల్లాలో చంద్రబాబు పర్యటించారు. నందికొట్కూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులపై యుద్ధభేరి ప్రకటించాలని వచ్చానని చెప్పారు. రాయలసీమకు జగన్ ద్రోహం చేశారని మండిపడ్డారు. సీమ కోసం జగన్ ఏనాడైనా పని చేశారా? అని ప్రశ్నించారు.తాము అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. 20 లక్షల కంటే ఎక్కువ ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. జాబు కావాలంటే బాబు రావాల్సిందేనని తేల్చిచెప్పారు. మూడు రాజధానులపై చంద్రబాబు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రోడ్డుకు మట్టి వేయలేరు కానీ 3 రాజధానులు కడతారట అంటూ ఎద్దేవా చేశారు. “ఒక రాజధానిని నాశనం చేసి మూడు రాజధానులని అంటున్నారు. మన రాజధాని ఏదంటే చెప్పుకోలేని దుస్థితిలో మనం ఉన్నాం” అని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీని భూస్థాపితం చేస్తే తప్ప మనకు న్యాయం జరగదని అన్నారు

## సాధ్యపడదన్న కేసీఆర్ నోటి నుంచే కార్మికులు ఆ మాట చెప్పించారు: వైఎస్ షర్మిల

- సోషల్ మీడియా వేదిక ద్వారా స్పందించిన వైఎస్సార్టీపీ అధ్యక్షురాలు
- సమ్మెలో అసువులు బాసిన కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి

కార్మికుల డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలన్న షర్మిల



ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై తెలంగాణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. సోషల్ మీడియా అనుసంధాన వేదిక ఫేస్‌బుక్ ద్వారా ఆమె ఆర్టీసీ విలీనంపై స్పందించారు. అసాధ్యమన్న కేసీఆర్ నోట కార్మికులు సాధ్యం అనిపించారన్నారు. ఈ మేరకు షర్మిల స్పందిస్తూ.. ఆర్టీసీ విలీనం సాధ్యపడదన్న కేసీఆర్ నోటి నుంచే ఆర్టీసీని విలీనం చేస్తామనే మాటను కార్మికులు చెప్పించారన్నారు.అంతేకాదని, ఆర్టీసీ సమ్మెలో అసువులు బాసిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల డిమాండ్లన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు సోమవారం నాటి తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి కేటీ రామారావు సోమవారం సాయంత్రం మీడియాకు తెలిపారు.



## తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదల..

**- సెప్టెంబర్ 15న టెట్ పేపర్-1, పేపర్ -2 పరీక్షలు**

**-రేపటి నుంచి ఈనెల 16 దాకా దరఖాస్తులు**

**-పరీక్షలకు రెండున్నర లక్షల మంది దాకా హాజరయ్యే అవకాశం**

తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 15న టెట్ పేపర్-1, పేపర్ద-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. రేపటి నుంచి ఈ మేరకు దరఖాస్తులను స్వీకరించనుంది. ఈ నెల 16వ తేదీ దాకా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. https://tstet.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయవచ్చు. ఒక్కో పరీక్ష ఫీజు రూ.400.

పేపర్ 1 పరీక్షను డీఈడీ, బీఈడీ అభ్యర్థులు రాసుకునేందుకు అవకాశం కల్పించారు. బీఈడీ చేసిన వాళ్లు రెండు పేపర్లను రాసుకోవచ్చు. ఈ సారి టెట్ పరీక్షకు 2 లక్షల నుంచి రెండున్నర లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంది. సెప్టెంబర్ 15న పరీక్ష నిర్వహించి, అదే నెల 27న ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం

## విశాఖలో ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి

# భూమిపూజ చేసిన వైఎస్ జగన్

**విశాఖలో ఈ ప్రాజెక్టు ఒక ఆణిముత్యంగా నిలిచిపోతుందన్న సీఎం**

**రహేజా గ్రూప్‌కు ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామని హామీ**

**ఈ మాల్ రాకతో విశాఖ రూపురేఖలు మారుతాయన్న జగన్**

**వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న సీఎం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖలోని కైలాసపురం వద్ద ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.600 కోట్లతో 13 ఎకరాల స్థలంలో ఈ మాల్‌ను రహేజా గ్రూప్ నిర్మిస్తోంది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... విశాఖలో ఈ ప్రాజెక్టు ఒక ఆణిముత్యంగా నిలిచిపోతుందన్నారు. ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించాలని కూడా రహేజా గ్రూప్ ఆసక్తితో ఉందన్నారు. రహేజా గ్రూప్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారికి ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామన్నారు.ఈ మాల్ ఇక్కడకు రావడంతో విశాఖపట్నం రూపురేఖలు మారుతాయన్నారు. ఈ మాల్ దక్షిణాదిలోనే అతిపెద్ద మాల్ కావొచ్చునని పేర్కొన్నారు. ఇక్కడ మాల్ కోసం రూ.600 కోట్ల భారీ పెట్టుబడి పెడుతున్నారని, దీంతో ఎనిమిది వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పన్నెండు, పదమూడు ఎకరాల్లో మాల్ వస్తుందని, ఆ తర్వాత మిగతా నాలుగైదు ఎకరాల స్థలంలో ఫేజ్ 2 కింద ఐటీ స్పేస్‌ను తయారు చేస్తామన్నారు. ఇక్కడ ఇంటర్నేషనల్ స్టాండర్డ్ కన్వెన్షన్ సెంటర్ నిర్మించే ప్రణాళికలు ఉన్నాయన్నారు. వీటి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

రానున్న రోజుల్లో విశాఖను గ్లోబల్ చార్ట్‌లో పెట్టే విధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఇది వరకు అదానీ డేటా పార్క్‌ను, భోగాపురం విమానాశ్రయానికి భూమిపూజ చేశామని గుర్తు చేశారు. శ్రీకాకుళంలోని మూలపేటలో సీపోర్ట్‌కూ



శంకుస్థాపన చేశామన్నారు. ఇవన్నీ ఉత్తరాంధ్ర రూపురేఖలను పూర్తిగా మార్చుతాయన్నారు. వీటి తర్వాత ఇప్పుడు విశాఖకు సౌతిండియాలోనే అతిపెద్ద మాల్ రానుందన్నారు. విశాఖలో ఒబెరాయ్ హోటల్స్ రానున్నాయన్నారు. మరో హోటల్ చైన్ కూడా ఇక్కడకు రానుందన్నారు.

# ఆశా వర్కర్లకు మంత్రి హరీశ్ రావు తీపి కబురు



తెలంగాణలో ఆశా వర్కర్లు చాలా కష్టపడుతున్నారని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రశంసించారు. వారి కృషిని, కష్టాన్ని ప్రభుత్వం గుర్తించిందని చెబుతూ.. ఈ నెల నుంచి ఆశా వర్కర్ల ఫోన్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. దేశంలోని మిగతా రాష్ట్రాలకంటే తెలంగాణలోని ఆశా వర్కర్లకే ఎక్కువ జీతం ఉందని చెప్పారు. దీనికి తోడు ఈ నెల నుంచి వారికి ఫోన్ బిల్లలు భారాన్ని కూడా తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈమేరకు మంగళవారం నెక్లెస్ రోడ్ లో జరిగిన వైద్యారోగ్య శాఖ కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు మాట్లాడారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు చాలా మెరుగు పడిందని మంత్రి హరీశ్ రావు చెప్పారు. గతంలో ప్రసవం కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే వారని, ప్రస్తుతం ఈ పరిస్థితి మారిందని వివరించారు. గతంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో 70 శాతం డెలివరీలు జరిగితే మిగతా 30 శాతం మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగేవని చెప్పారు. కానీ, ప్రభుత్వం తీసుకున్న చర్యలకు తోడు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది కృషితో నేడు పరిస్థితి రివర్స్ అయిందని మంత్రి వివరించారు.ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులలో 70 శాతం డెలివరీలు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు మూతపడే పరిస్థితికి వచ్చాయని తెలిపారు. ఇటీవల తనను కలిసిన ప్రైవేటు డాక్టర్ల బృందం కూడా ఇదే విషయం చెప్పి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు 104 వాహనాలలో గర్భిణీలను ప్రభుత్వ ఆసుపత్రులకే తీసుకెళుతున్నారని అన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మ ఒడి తదితర ప్రభుత్వ పథకాలతో ప్రైవేటు ఆసుపత్రులకు డెలివరీ కోసం వచ్చే వారి సంఖ్య తగ్గిందని చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత కష్టపడి పనిచేయాలంటూ ఆశా వర్కర్లకు, ఏఎన్ఎంలకు మిగతా వైద్య సిబ్బందికి మంత్రి పిలుపునిచ్చారు

# జగనన్న సురక్ష ద్వారా 2,88,565 ఉచిత సర్వీసులు.

## -జిల్లా రెవిన్యూ అధికారి బి. పుల్లయ్య



ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు, 01:
జిల్లాలో నెలరోజుల పాటు జరిగిన జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు అవసరమైన 2,88,565 ఉచిత సర్వీసులు అందించి విజయవంతం చేశామని డిఆర్ఓ పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్ లో జగన సురక్ష కార్యక్రమంపై మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా డిఆర్ఓ పుల్లయ్య మాట్లాడుతూ జూన్ 24వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 2,88,565 ఉచిత సర్వీసులు అందించామన్నారు. ప్రజల నుండి ఎలాంటి సర్వీస్ ఛార్జ్ తీసుకోకుండా ఉచితంగా అవసరమైన ధృవపత్రాలు అందించడం జరిగిందన్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 409 సచివాలయాలు, 6 మున్సిపాలిటీల పరిధిలో ఉన్న 107 వార్డు సచివాలయాలు వెరసి మొత్తం 516 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు నియోజకవర్గ స్పెషల్ అధికారులుగా, ఎంపీడీవోలు తాసిల్దార్లు రెండు బృందాలుగా ఏర్పాటై జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేశారన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చామన్నారు. సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి ముందుగానే వెళ్లి వారికి కావాల్సిన సర్వీసులు ఏవైనా ఉన్నాయా అని తెలుసుకుని, సుమోటోగా వాలంటీర్ ద్వారా అప్లికేషన్ పెట్టించామన్నారు. వారం రోజుల తర్వాత ఆ సచివాలయంలోనే క్యాంపు ఏర్పాటు చేసి ఎంపీడీవో, డిప్యూటీ తహశీల్దార్ ఒక టీంగా, తహశీల్దార్, ఈఓఆర్డి మరొక టీంగా ఏర్పడి సచివాలయ పరిధికి వెళ్లి ఏ సర్వీసెస్ అయితే రిజిస్టర్ చేశారో ఆ సర్వీసెస్ కి సంబంధించిన సర్టిఫికెట్లు ప్రజలకు నేరుగా అందించామని తెలిపారు. 516 సచివాలయాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసి 2,88,565 సర్వీసులు అందించామన్నారు. స్వీకరించిన సర్వీస్ రిక్వెస్ట్ లలో 99.21 శాతం సర్వీసులను ప్రజలకు ఎటువంటి సర్వీస్ ఛార్జ్ లేకుండా ఉచితంగా అందించామన్నారు.
2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ధ్రువపత్రాలను అతి తక్కువ సమయంలో అందించడం జరిగిందన్నారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 1,35,536, ఇన్కమ్ సర్టిఫికెట్లు 1,29,412 పంపిణీ చేసామన్నారు. ఆర్ఓఆర్ 1(బి) సర్టిఫికెట్ లు 5,517, ఆధార్ కార్డులో మొబైల్ నెంబర్ అప్డేట్ సర్వీస్ 5,366, కంప్యూటరైజేషన్ ఆఫ్ అడంగల్ సర్టిఫికెట్ 2,578 మందికి, పెళ్ళైన కారణం చేత గాని లేదంటే వివిధ కారణాల చేత గాని ఇంటి సభ్యుల స్ప్లిట్టింగ్ జరిగిన వారికి 2,196 రేషన్ కార్డులు, కొత్త రైస్ కార్డులు 306 తో పాటు ఇతర సర్వీసులు మొత్తము 2,88,565 అందించామని డిఆర్ఓ వివరించారు.
ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ లాంటివి, మ్యుటేషన్ లాంటి సేవలను నిర్దిష్ట గడువు లోపు అర్జీదారులకు అందజేయడం జరుగుతుందని డిఆర్ఓ తెలిపారు. జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమాలలో స్వీకరించిన ఫిర్యాదులను ప్రజలు సంతృప్తి చెందిస్తాయిలో పరిష్కరించడంతోపాటు.... పరిష్కారం కాని వాటిని ఏ కారణం చేత పరిష్కారం కాలేదని వారికి తెలియజేయడానికి సురక్ష క్యాంపులు, ఇంటింటి సర్వే చాలా ఉపయోగపడ్డాయన్నారు. అదేవిధంగా ప్రజలకు ఏవైతే హక్కుగా అందాలో వాటిని లబ్ధిదారులకు అందజేయడానికి ఈ క్యాంపులు సద్వినియోగపడ్డాయన్నారు.

# మీ పార్టీ అధికారంలోకి వస్తే కడప ఉక్కు కర్మాగారాన్ని తెరిపిస్తారా? లేదా?



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 01:
మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీ టిడిపి ప్రభుత్వంలోనే స్పిన్నింగ్ మిల్లు మూత పడినది తెరిపించగలరా లేదా అలాగే మీ ప్రభుత్వంలోనే నంద్యాల చక్కెర ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ జరిగినది ఫ్యాక్టరీ మూతపడి కార్మికుల రోడ్లపాలైనారు మీరు అధికారంలో ఉన్నప్పుడు నంద్యాల పర్యటన వచ్చిన సందర్భంగా దీబగుంట్లలో చక్కెర ఫ్యాక్టరీలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ ఏర్పాటు చేస్తామన్నారు చేస్తారా లేదా తెలియజేయాలి నంద్యాల జిల్లా పర్యటనలో మరియు కడప జిల్లా పర్యటన కూడా చేస్తున్నారు కడప ఉక్కు రాయలసీమ హక్కు అని అందరూ రాష్ట్ర విభజన సందర్భంగా పోరాడినారు మీ ప్రభుత్వంలో ఉన్న రాజ్యసభ్య సభ్యుడు రమేష్ ఆమరణ దీక్ష చేస్తే మీరే విరమింప చేసి కడప ఉక్కు ఫ్యాక్టరీ తెరిపిస్తామని శంకుస్థాపన చేశారు రమేష్ పార్టీ మారి బిజెపిలోకి వెళ్లారు కానీ రాయలసీమలో ఉన్న ప్రజల తలరాతలు మారలేదు కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం జరగలేదు జగన్ ప్రభుత్వంలో కూడా జరగలేదు ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వము కడప ఉక్కు ఫ్యాక్టరీ వలన ప్రయోజనం లేదని తెలిపారు. పార్లమెంటు సాక్షిగా కేంద్రమంత్రి కూడా వాటిపైన మాట్లాడలేదు మరి మీరు అధికారంలోకి వస్తే తెరిపించగలరా లేదా తెలియజేయండి ప్రాజెక్టుల తో పాటు పారిశ్రామిక అభివృద్ధి కూడా జరగాలని మీరే అనేకసార్లు అధికారంలో ఉన్నప్పుడు చెప్పారు పారిశ్రామిక అభివృద్ధి జరిగితే సంపద సృష్టించగలుగుతారు సంపద సృష్టిస్తే ప్రజలకు మీరు చేసే వాగ్దానాలు అమలు చేయగలుగుతానని తెలియజేస్తున్నారు. సంపద సృష్టించే ఫ్యాక్టరీలు మూతబడి కార్మికు లు కడుపులు కాల్చుకొని అల్లాడుతుంటే మీ ప్రభుత్వంలో పరిష్కారం జరగలేదు నేడు జరగడం లేదు కార్మికుల వద్ద జీతాలు వేతనాలు రాక కొనుగోలు శక్తి తగ్గడం వల్ల మార్కెట్ లేక వ్యాపార వర్గాలు కూడా దెబ్బతింటున్నాయి వీటి పరిష్కారము మీరు నంద్యాల కడప జిల్లా పర్యటనల సందర్భంగా తెలియజేయాలని సిపిఎం జిల్లా నాయకునిగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి మస్తాన్వలి చేస్తున్నాను. మీ ప్రభుత్వ ఉన్న సమయంలో ఉద్యోగ కార్మికులకు రెగ్యులర్ కాలేదు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవు అప్పుడు ఇవ్వలేని వారు ఇప్పుడు ఏ విధంగా ఇస్తారో తెలియజేయాలి అలాగే మీరు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు ఓ పి ఎస్ అమలు చేయడానికి కాదు అని తెలియజేశారు వాటిని దృష్టిలో ఉంచుకొని జగన్మోహన్ రెడ్డి అద్దంలో ఆకాశం చూపించి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు నేటి వరకు ఏది అమలు చేయడం లేదు మీరు చేయగలరా లేదా వాస్తవాలతో తెలియజేయండి ప్రధానంగా రాష్ట్రాల హక్కుల కొరకు ఫెడరల్ వ్యవస్థ కొరకు రాజ్యాంగ హక్కులను కాపాడుకొనుటకు మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ఉన్మాద పార్టీలో మీ వైఖరి ఏమిటి మణిపూర్ లో జరుగుతున్న హింసకాండ పైన మీ వైఖరి ఏమిటి తెలియజేయండి మీ పార్టీ కూడా జాతీయ పార్టీ కదా జాతీయ పార్టీ అయింది కావున దేశవ్యాప్త సమస్యలపై కూడా మీరు మాట్లాడుతూ ఆ ప్రభావం మన రాష్ట్రం పైన కూడా పడుతుంది మేల్కొనండి అని పిలుపు ఇవ్వాలి ఎందుకు ఇవ్వడంలేదని నేను డిమాండ్ చేస్తున్నాను.

# ఆశ వర్కర్లపై పనిభారం తగ్గించాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 01:
ఆశా వర్కర్లపై పని భారాన్ని తగ్గించాలని, వారితో వ్యాక్సిన్ కాలర్లు మోయించరాదు అని ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని, ఆశ వర్కర్ల నియామకాల్లో రాజకీయ జోక్యం తగ్గించాలని, ప్రభుత్వమే ఆశా నియామకాలు జరపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం సంక్షేమ పథకాలను అమలు చేయాలని, సిఐటియు జిల్లా కార్యదర్శి వీ, బాల వెంకట్ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి, రమణకుమారి లు వివిధ పీహెచ్సీలో జరిగిన ఆశాడే కార్యక్రమాలకు ముఖ్య అతిథులు పాల్గొని మాట్లాడుతూ ఆశాలపై పని భారం తగ్గించాలని ఆశలకు సంబంధం లేని పనులు చేయించరాదని ఆశ వర్కర్ల నియామకాలు ప్రభుత్వమే నిర్వహించాలని అక్రమ తొలగింపులు వేధింపులు ఆపాలి రాజకీయ జోక్యాలు తగ్గించాలని విధి నిర్వహణలో మరణించిన కుటుంబాలకు ఆశా వర్కర్స్ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వ సెలవులు మెడికల్ లీవులు వేతనంతో కూడిన వెటర్నరీలు ఇవ్వాలని 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని 104 ఉద్యోగుల కోసం ఆశా వర్కర్లతో ఎటువంటి అదనపు ఖర్చులు చేయించరాదని డిమాండ్ చేశారు. నాణ్యమైన సెల్ ఫోన్స్ ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని వ్యాక్సిన్ క్యారియర్ ఆశ వర్కర్లతో తెప్పించరాదని తదితర డిమాండ్ల వెంటనే పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు వ్యాక్సిన్ క్యారియర్




ఆశాలకు ఎటువంటి సంబంధం లేదని ఎన్సీడీసీ సర్వే కూడా ఆశలతో చేయించరాదని ఆశలను వేదిస్తే డీఎంహెచ్వో రాతపూర్వకంగా ఫిర్యాదు చెయ్యాలా అన్నారు ఈ సమావేశాల్లో ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు చెన్నమ్మ, సువర్ణ రాజేశ్వరి, నాగలక్ష్మి, సుభద్ర ఆశాబి లతోపాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# "జాబు రావాలంటే బాబు రావాలి.

## -టీడీపీ అధినేత చంద్రబాబు"

ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జూలై01:
ఉమ్మడి కర్నూల్ జిల్లా లొ మాజీ ముఖ్యమంత్రి నారచంద్రబాబు నాయుడు పర్యటన.
రాష్ట్రంలో ఎవరైనా రౌడీయిజం చేస్తే తాట తీస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో అన్యాయాలు అక్రమాలు, దోపిడీలు, హత్యలు,తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు.సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై 'యుద్ధభేరి' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. ముచ్చుమర్రి ప్రాజెక్టును చంద్రబాబు సందర్శించారు. అనంతరం నందికొట్కూరులో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.మన రాజధాని ఏదంటే చెప్పుకోలేని స్థితిలో ఆంధ్రప్రదేశ్. ప్రజలు, యువత ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే 20 లక్షల కంటే ఎక్కువ ఉద్యోగాలు ఇస్తా మన్నారు.





# చంద్రబాబు నాయుడు కు ఆత్మీయ స్వాగతం పలికిన తాత రెడ్డి తులసి రెడ్డి.

ఆంధ్ర ప్రగతి ఓర్వకల్లు ఆగస్టు1:
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లాకు ప్రాజెక్టులను పరిశీలించడానికి వచ్చిన సందర్భంలో పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు ఎయిర్పోర్టులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును తెలుగుదేశం పార్టీ నాయకుడు ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి పూలబొకే అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడును ఓర్వకల్లు ఏర్పోర్ట్ నందు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు ఏరాస్ ప్రతాపరెడ్డి కాంట్రాక్టర్ మండ్లగుర్రప్ప, కాపు సామాజిక వర్గం నాయకుడు మాజీ కౌన్సిలర్ చింతల సుబ్బరాయుడు, గోల్డెన్ ఫంక్షన్ హాల్ యజమాని పెసరవాయి హుస్సేన్ సా, రామకృష్ణ యాదవ్, రామయ్య యాదవ్, జూనియర్ న్యాయవాదులు మరియు టి టి ఆర్ అసోసియేట్ సభ్యులు తదితరులు అందరు కూడాఈ కార్యక్రమంలో పాల్గొన్నారుపాల్గొన్నారు.

# ముచ్చుమర్రి ప్రాజెక్టును సందర్శించిన చంద్రబాబుతో భూమా.



ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు ఆగస్టు1:
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన పది రోజుల సాగు నీటి ప్రాజెక్టుల సందర్శన లో భాగంగా మంగళవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం లోని ముచ్చుమర్రి గ్రామం నందు ఉన్న ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నంద్యాల నియోజకవర్గ ఇంచార్జి శ్రీ భూమా బ్రహ్మానంద రెడ్డి గారు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు , మాజీ ఎమ్మెల్యేలు , మాజీ ఎమ్మెల్సీలు , కర్నూల్ నంద్యాల జిల్లాల నియోజకవర్గ ఇన్చార్జిలో , మాజీ కార్పొరేషన్ చైర్మన్లు , నాయకులు , కార్యకర్తలు , పెద్ద సంఖ్యలో అభిమానులు ప్రజలు పాల్గొనడం జరిగింది.

# విజయవంతమైన ఛలో ఢిల్లీ.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 01:
రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రాయలసీమ హక్కులకై సేవ్ రాయలసీమ పేరుతో నీళ్లు, నిధులు, నియామకాల సమాన వాటా తో పాటు కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర మరియు నవలీ ప్రాజెక్టులు నిలుపుదల చేయాలని, నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద కృష్ణానదిపై కేంద్ర ప్రభుత్వం నిర్మించబోయే ఐకానిక్ బ్రిడ్జి( తీగల వంతెన ) బదులు రోడ్డు కం బ్యారేజ్ నిర్మించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో చేపట్టిన సేవ్ రాయలసీమ కార్యక్రమం విజయవంతమైందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు యం. వి. రమణారెడ్డి, రామిరెడ్డిలు అన్నారు. నంద్యాల జిల్లా నలుమూలల నుండి వందలాది రాయలసీమ రైతులు, యువత పాల్గొని విజయవంతం చేసినందుకు ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు.ద

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల, జులై01:
గిద్దలూరు-నంద్యాల ఘాట్ రోడ్ లో బొగద దగ్గర పాత రైల్వే ట్రాక్ గరండాలు, మోత్కుమానుశల దగ్గర మంగళవారం మధ్యాహ్నం ఒక గుర్తు తెలియని మగ మృతదేహం లభ్యమైట్లు శిరివెళ్ల సీఐ చంద్రబాబు నాయుడు ఎస్సై సురేష్ తెలిపారు. సుమారుగా వయస్సు 40-45 సం. లు గా ఉండోచ్చున్నారు. లోయలో సుమారుగా 20-25 మీటర్ల లోతులో పడిపోయి ఉన్నాడని, ఒంటి మీద తెల్లని ఫుల్ చొక్కా, ఆకుపచ్చ లుంగీ ఉందన్నారు. కుడి చేతికి ఆంజనేయ స్వామి పచ్చ బొట్టు, జుట్టు, గడ్డము కొద్దిగా నెరిసి ఉన్నది తెలిపారు.ఇతని ఆచూకీ తెలిసిన వారు. శిరివెళ్ల ఎస్ఐ 9121101170, శిరివెళ్ల సీఐ 9121101169 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

# చంద్రబాబు నీకు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత ఉన్నదా?

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు01: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించడానికి నంద్యాల జిల్లా నందికొట్కూరు ముచ్చుమర్రి ప్రాజెక్టు వద్దకు వచ్చి పరిశీలిస్తున్న తరుణంలో నంద్యాల జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లొంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ...

1.సాగునీటి ప్రాజెక్టులు వైయస్సార్ పేటెంట్ కాదా?
రాయలసీమకు ప్రాణాధారమైన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 44 వేల క్యూసెక్కులకు పెంచాలని రాజశేఖర రెడ్డి గారు ఉద్యమం చేస్తే తెలుగు దేశం పార్టీ నాయకులతో వ్యతిరేకంగా మీరు ఉద్యమం చేయించినమాట వాస్తవం కాదా?
పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, శ్రీశైలం కుడి ప్రధాన కాలువ సామర్థ్యం పెంపు, గోరకల్లు, అవుకు, గండికోట, మైలవరం, సర్వారాయ సాగర్ రిజర్వాయర్ల నిర్మాణం, మల్యాల, మచ్చుమర్రి, పైడిపాలెం ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టిన వ్యక్తి రాజశేఖర రెడ్డి గారు.. వీటి గురించి ఎప్పుడైనా ఆలోచించారా చంద్ర బాబు నాయుడుగారూ???

2.చంద్రబాబు గారు మీరు సొంతంగా ప్రారంభించిన పథకం ఏది? పూర్తి చేసిన పథకం ఏది? ఒక్క ప్రోజక్టు చెప్పగలరా?

3. 40 టీఎంసీల సామర్థ్యంతో హంద్రీ-నీవా ను సాగునీటి ప్రాజెక్టుగా ప్రతిపాదన చేస్తే మీరు ఐదు టీఎంసీల మంచినీటి ప్రాజెక్టుగా మార్చడానికి ఎందుకు ప్రయత్నించారు?
మరలా రాజశేఖర రెడ్డి గారు ముఖ్య మంత్రి అయిన తరువాత తిరిగి సాగునీటి ప్రాజెక్టుగా మార్చి పనులు మొదలు పెట్టిన మాట వాస్తవం కాదా?

4. జలయజ్ఞంలో భాగంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు హంద్రీ-నీవా గాలేరు- నగరిని ఎంత శాతం పూర్తి చేశారు? ఎంత డబ్బు ఖర్చు చేశారు? మీరు వచ్చిన తర్వాత మీ ప్రభుత్వం ఎంత శాతం పూర్తి చేశారు? ఎంత డబ్బు ఖర్చు పెట్టారు? హంద్రీనీవాకు మొట్టమొదట నీళ్లు మళ్లించినది ఎవరు? మీ కాలంలో కనీసం మొదటి దశ కింద పంటలకు నీరు



ఇచ్చారా?

5. శ్రీశైలం ప్రాజెక్టులో 840 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడు కరువు సీమకు వరప్రదాయని అయిన గాలేరు -నగరికి పంపింగ్ చేసుకోవాలని జీవో జారీ చేస్తే మీ పార్టీ నాయకులతో వ్యతిరేకంగా ధర్నా చేయించడం నిజం కాదా?

6. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచాలన్నప్పుడు ప్రకాశం జిల్లా మీ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలతో అభ్యంతరం చెప్పించిన మాట వాస్తవం కాదా?

7. 2003లో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పర్ భద్ర ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని సంబంధిత అధికారులు మీకు నివేదిక ఇచ్చినప్పుడు ఎందుకు మౌనంగా ఉండిపోయారు? ఆనాడు ఎందుకు అడ్డుకోలేకపోయారు?
ఆంధ్ర ప్రదేశ్ కు తీవ్ర నష్టం కలిగించే ఆల్మట్టి డామ్ 519 కాదు 524 మీటర్లకు దేవ గౌడ ను నేనే ప్రధాన మంత్రిని చేశాను అని చెప్పుకునే మీ హయాంలోనే నిర్మాణం జరిగితే ఏం చేశారు చంద్ర బాబు నాయుడు గారూ?

8. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ ఎల్ సి) ఆధునీకరణకు గత ప్రభుత్వాలు చేసిన ఖర్చు ఎంత? పూర్తి చేసిన పని ఎంత? మీరు ఖర్చు చేసినది ఎంత? పూర్తి చేసినది ఎంత? ఎందుకు పూర్తి చేయలేకపోయారు?

9. తుంగభద్ర సమాంతర కాలువ తీసుకురావాలని మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడుతున్నారే గాని మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసిన ప్రయత్నం ఏమిటి?
ఇవి అన్ని రాయలసీమ వ్యతిరేక చర్యలు కావా???

## జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టకుండా

# ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-జర్నలిస్టుల సమస్యలే ప్రధాన ఎజెండా. -వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి.

-ఆంధ్రప్రదేశ్ డి జే ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు..యరమల కిషోర్ రెడ్డి.

ఆంధ్ర ప్రగతి విజయవాడ ఆగస్టు01:
మీడియా రంగాల్లో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాలు తో పాటు హెల్త్ కార్డులు రవాణా సౌకర్యం వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రవేట్ పాఠశాలలో కాలేజీలలో ఫీజు రాయితీ మంజూరు చేయాలని డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు యరమల కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు ఈ మేరకు ఆయన విజయవాడ విలేకరితో మాట్లాడుతూ
ఎంతో మంది ఈ రంగంలోకి వచ్చినప్పటికీ వారికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అలాగే జర్నలిస్టుల కు రాష్ట్రంలో ఒక ఎమ్మెల్సీ నీ కేటాయించాలని చిన్న పత్రిక పెద్ద పత్రిక యూట్యూబ్ ఛానల్ అనే తామరయం లేకుండా నిజాలను నిర్భయంగా రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం శ్రద్ధ చూపాలని తెలిపారు. సమాజానికి సేవ చేసే జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు.
జర్నలిస్టు వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న అనేకమంది కి ఇళ్ల స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు రాష్ట్రంలో జర్నలిస్టుల



సమస్యలపై ఏ యూనియన్ తో అయినా సరే కలిసి పనిచేయటానికి డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు

# మనసున్న మారాజు శ్రీరాములు...కూతురు పుట్టినరోజు వేడుకలు

- 22 వాలెంటరీ..11 పారిశుద్ద సిబ్బందికి గౌరవ పారితోషికం.

- కౌన్సిలర్ పదవీ కాలమంతా ప్రతి నెల ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్ట్ 01: మనసున్న మారాజు శ్రీరాములు కూతురు జన్మదిన సందర్భంగా... వాలెంటరి,పారిశుద్ద సిబ్బంది కష్టాలు గుర్తించారు..ప్రభుత్వం ఇస్తున్న జీతాలతో పాటు ..తనవంతు సహాయంగా కూతురు జన్మదినాన్ని పురస్కరించుకొని 33 మందికి ప్రతినెల వెయ్యి రూపాయలు ఇస్తానని పేర్కొన్నారు.పొన్నాపురం వైసిపి వార్డ్ ఇంచార్చి పరుచూరి శ్రీరాములు కూతురు పి.వి.అర్.శ్రిత ప్రజ్ఞ అందరి సమక్షంలో కేకు కట్ చేశారు.ఈ సందర్భంగా పొన్నా పురం వైసిపి వార్డ్ ఇంఛార్జి శ్రీరాములు,కౌన్సిలర్ పరుచూరి నారాయణమ్మ లు మాట్లాడుతూ పొన్నా పురం సచివాలయంలో పనిచేస్తున్న వాలెంటరి లు 22 మందికి పారిశుధ్య సిబ్బందికి ఈ నెల నుంచి ప్రతి నెల వెయ్యి రూపాయలు కౌన్సిలర్ పదవీ ఉన్నంతవరకు అందజేస్తానని అన్నారు.పోన్నాపురం ప్రజలకు ఏలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించాలని అన్నారు.మన వార్డు ప్రజలు సమస్యలు లేకుండా చూసుకోవాలని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి,ఎమ్మెల్యే శిల్పా రవి



చంద్ర కిషోర్ రెడ్డి కి మంచి పేరు తీసుకొని రావాలన్నారు.పొన్నాపురం కు చెందిన ప్రతి ఒక్కరూ నా కూతురిని ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# కామారెడ్డి పట్టణం చికెన్ సెంటర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కామారెడ్డి)కామారెడ్డి జిల్లా కేంద్రం లో మంగళవారం నూతన చికెన్ సెంటర్ అసోసియేషన్ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు ఎండిఇషాద్,ఉపాధ్యక్షులు : మన్మోహన్ రెడ్డి, కుర్రం అలీ ప్రధాన కార్యదర్శి:ఎండి నాజిత్
కోశాధికారి: దిలీప్ రెడ్డి,మరియు ముషీబ్ ఖాన్, నిర్వహణ సభ్యులు: డి సతీష్ ఎండి నిజాముద్దీన్ , అజిం భాయ్,మహమూద్ సాజిద్ భాయ్ ఈ కమిటీకి సంబంధించి ప్రతి చికెన్ సెంటర్ యజమానులు సహకరించి ఈ కమిటీని ఎన్నుకోవడం జరిగింది ఈ కమిటీ ద్వారా ప్రతి ఒక్క చికెన్ సెంటర్లు లాభసాటిగా సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అదేవిధంగా ఏ సమస్యలొచ్చినా కమిటీకి తెలిపి ఆ సమస్యను పరిశించుకోవాలని ఎన్నీ సమస్యలు ఉన్న కమిటీకి తెలిపాలని ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో పాటుపడాలని అన్నారు.





# జగనన్న ప్రభుత్వం హయాంలోనే అందుతున్న సంక్షేమ పథకాలు.

ఆంధ్ర ప్రగతి కర్నూలు ఆగస్టు01:
మంగళవారం సాయంత్రం కొనసాగిన గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం 5వ వార్డ్ 13వ సచివాలయం పరిధిలో ఉన్న గడ్డ ఈద్గా,చిత్తర్ వీధుల్లో నిర్వహించారు.
పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. స్థానిక 5వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, స్థానిక వార్డ్ నాయకులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిత్తర్ విధిలో ఉన్న ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ కార్పొరేటర్ జి.యల్.వి సుజాత పార్టీ ముఖ్యనాయకులు జి.యల్.వి శేషు యాదవ్ గారు,అక్బర్ అలీ , మెహబూబ్ బాషా , ఖాదర్ మాక్సూద్ ,అబ్దుల్లా ,మొయిద్ ,జెట్టి యాదవ్ , వెంకీ యాదవ్ ,యుగేందర్ , శ్రీనివాసులు , ఫాతిమా , అఫ్రీన్ , శ్రీదేవి ,ఆచారి ,సత్యమయ్య , రాజు , ఆరిఫ్,శారదా, శకుంతల ,కన్వీనర్లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుకున్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్

ఆంధ్ర ప్రగతి తిరుపతి ఆగస్టు01:
ఈ సందర్భంగా బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్ర ప్రజలందరూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారని,సైకో పాలన పోయి చంద్రన్న రావాలని , రాబోయే



సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మరలా అసెంబ్లీలో అడుగు పెడతారని రాజేంద్రప్రసాద్ అన్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, తెదేపా రాష్ట్ర బీసీ సెల్ సెక్రెటరీ రాజులపాటి ఫణి, పారుపూడి వీరమ్మ తల్లి కమిటీ సభ్యులు నెరుసు బాలకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు ములుగూరి రాఘవేంద్ర ప్రసాద్, రాజులపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తున్న వాలంటీర్లు.

ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 01:
మహానంది మండల వ్యాప్తంగా వైఎస్సార్ భరోసా పెన్షన్ కానుకను వేకువజామున నుంచే గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 6 గంటలనుంచే గడపగడపకు పింఛన్ పంపిణీ మొదలైంది. లబ్ధిదారులు పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా వలంటీర్లు ఇంటి వద్దకు చేరుకుని పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.



# ముగిసిన మౌలాలి స్వామి జార్తులు.

-అశేష సంఖ్యలో తరలివచ్చిన జనం




ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు01:
మహానంది మండల పరిధిలోని మజరా గ్రామపంచాయతీ గాజులపల్లె గ్రామంలో మొహరం పండుగ ముగింపు సందర్భంగా మౌలాలి స్వామి జార్తులు వేడుకలు వైభవంగా నిర్వహించారు.కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, ఆధ్వర్యంలో మౌలాలి స్వామికి ప్రత్యేక ఫాతెహాలు, గంధాన్ని సమర్పించారు.మొహరం పండుగ ముగిసిన మూడు రోజులకు మౌలాలి స్వామి జార్తులు వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ వస్తుంది. పీర్ల చావిడి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మౌలాలి స్వామి పీరుకు దట్టీలు, పూల సూచికలు, హస్తాలు, గొడుగులు, ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి నుండి ఉదయం వరకు స్థానికులే కాక వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి పూల సూచికలు, కానుకలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.మౌలాలి స్వామి పీరు ఊరేగింపులో వేలాది సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసిన నంద్యాల తాలూకా రూరల్ సీఐ రవింద్ర,మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ కి కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు, ప్రజలు, అభినందనలు తెలిపారు

# మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు01: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నంద్యాల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనియన్ కార్యదర్శి భాస్కరాచారి అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు పట్టణ కార్యదర్శి కె మహమ్మద్ గౌస్ అధ్యక్షుడు లక్ష్మణ్ లతోపాటు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ ,ఆదాము,నాగేశ్వరరావు,కరిముల్లా,రామాంజనేయులు,సిద్దయ్య, రాజు,మహాబూబ్ బీ,సువర్ణమ్మ లతో పాటు 100మంది కార్మికులు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ నంద్యాల మునిసిపాలిటీలోని పర్మినెంట్, ఇంజనీరింగ్, పారిశుధ్య మరియు క్లాప్ డ్రైవర్స్ విభాగములలో పనిచేస్తున్న ఉద్యోగులు మరియు కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కార్మికులందరి సమస్యల పరిష్కారము కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి వారు యిచ్చిన పిలుపులో భాగంగా ఆగష్టు 1వ తేదిన మునిసిపల్ ఆఫీసు ఆఫీసు వద్ద ధర్నా

మున్సిపల్ కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలి.మున్సిపల్ కార్మికులందరికి %ూా.జ.ా,ా%. నుండి మినహాయింపు యివ్వాలి. %+ూ.వీం.చీశీ%.151 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగములోని అర్హత కలిగిన కాంట్రాక్టు కార్మికులందరికి స్కిల్డ్ మరియు సెమి స్కిల్డ్ వేతనాలు చెల్లించాలి.జి.ఓ.నెం.7, తేది: 17-1-2022 ప్రకారం కనీస విద్యా అర్హత మరియు సీనియారిటీ ప్రాతిపదికన అర్హత కలిగిన ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్ మరియు సెమీ స్కిల్డ్ వేతనములు చెల్లించాలి.మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగములోని కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కార్మికులందరికి రూ.6000/-ల హెల్త్ అలవెన్సులు మరియు రిస్క్ అలవెన్సులు చెల్లించాలి. మున్సిపల్ కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కార్మికులందరికి పనిముట్లు మరియు రక్షణ పరికరములు ఇప్పించాలి.



మున్సిపల్ కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కార్మికులందరికి ఇళ్ళ స్థలాలు మరియు ఇళ్ళు కట్టించి ఇవ్వాలి. మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలి.
మున్సిపల్ కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ కార్మికులు 60 సంవత్సరములు పూర్తి అయ్యి రిటైర్డు అయిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షల రూపాయలు ఇవ్వాలి.

## సంపాదకీయం

# విపత్తు నిర్వహణ తక్షణ అవసరం !

మంగళవారం 1-8-2023

విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్మీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వర సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక శిక్షిత సిబ్బందంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్థితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. ఈ దిశగా ఆలోచ నలు చేసి ఆచరణకు సిద్దపడాలి. అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి
దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తించవచ్చు. లేకుంటే కేంద్రబృందం ఎప్పుడో నెల తరవాత రావడం...పోటోలు చూడడం..అంచనా వేయడం జరుగుతోంది. అలా గాకుండా వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగిపోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు.

# ఆర్టీసీని గట్టెక్కించిన ఘనత కెసిఆర్‌దే

**- ప్రభుత్వంలో విలీన అతిపెద్ద నిర్ణయం**

**- 43వేల కుటుంబాల్లో దీపం వెలిగించాలి**

**- ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి**

**- ప్రజారవాణా మరింత మెరుగుపడుతుందన్న సజ్జన్నార్**

నిజామాబాద్,ఆగస్ట్1 )
: తెలంగాణ ఆర్టీసి రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడంపై టిఎస్ ఆర్టీసి ఛైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌ది ఎంతో గొప్ప మనస్సని, ఎప్పట్నుంచి బాధల్లో, కష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు ఆయన గొప్ప వరం అందించారని పొగడ్తల వర్షం కురింపించారు. రాష్ట్రవ్యాప్తంగా 43వేల మంది కుటుంబాల్లో ఆయన వెలుగులు నింపారని, మేమంతా ఎప్పటికీ ఆయన చేసిన మేలును మరిచిపోమన్నఆర్టీసి చైర్మెన్ బాజిరెడ్డి ఉద్యోగుల పక్షాన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇన్నాళ్ల ఉద్యోగుల కష్టాలన్నీ ఒకేసారి పోగొట్టారని తెలిపారు. గత కొంతకాలంగా ఆర్టీసీ కార్మికులు ఎంతో మనోవేదనకు గురవుతున్నారన్నారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినా సొంత రాష్ట్రంలో సముచిత స్థానం దక్కలేదని అన్నారు. ఏపీలో ఉద్యోగులు ఎంతో సంతోషం గా ఉన్నారనే భావన వారిలో ఉండేదని గుర్తు చేశారు. ఇవాళ కేసీఆర్ ముందు రెండు డిమాండ్లను తాను పెట్టానని, ఒకటి.. వెయ్యి కోట్ల నిధి గ్యారెంటీని కల్పిస్తే పీఎఫ్ చెల్లించి వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ మంచిగా దక్కేలా చూడాలని రెండు పీఆర్సీ చెల్లించాలని కోరామన్నారు. కానీ ఇవన్నీ తలకిందులు చేస్తూ కేసీఆర్ ఏకంగా కార్పొరేషన్‌ను ప్రభుత్వంలో విలీనం చేయడంతో అందరి కోరిక నెరవేరిందని అన్నారు. ఇది ఎంతో పెద్ద మనస్సుతో ఆర్టీసీ ఉద్యోగులకు కేసీఆర్ ఇచ్చిన వరమని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓ వైపు కార్పొరేషన్లను అమ్ముకుంటూ ఉద్యోగులను నడిబజార్‌లో పడేస్తుంటే.. కేసీఆర్ మాత్రం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారనడానికి చెప్పడానికి నిదర్శనమే తాజాగా విలీనం నిర్ణయం అన్నారు. ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో చేర్చుకోవడం చిన్న విషయం కాదని, ఈ నిర్ణయం దేశానికే ఆదర్శమన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్, తాను ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఈ క్రమంలో ఉద్యోగులకు కొంత మేలు చేయగలిగామన్నారు. కానీ లాభాల బాట పట్టించలేకపోయామని, కొంత నష్టాన్ని నివారించగలిగామని, ఇప్పుడు కేసీఆర్ నిర్ణయంతో ఇక ఉద్యోగుల కష్టాలకు శాశ్వత పరిష్కారం దొరికిందని అన్నారు. ఈ నిర్ణయాన్ని యావత్ రాష్ట్ర, దేశ ప్రజలు కూడా హర్షిస్తున్నారని అన్నారు. ఏపీ ప్రభుత్వం అక్కడ తీసుకున్న నిర్ణయాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉన్నాయో కమిటీ ద్వారా అధ్యయనం చేసి అంతకన్నా మెరుగైన లబ్ది చేకూరేలా ఇక్కడ నిర్ణయాలు అమలు చేస్తామన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లు పాస్ చేసి ఉద్యోగుల చిరకాల వాంఛ నెరవేర్చుతామని, వారి ఉద్యమ స్ఫూర్తికి కానుకగా దీన్ని అందిస్తామని చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థని ప్రభుత్వంలో విలీనం చేయాలని రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని ఆర్టీసి ఎండీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. సంస్థలోని దాదాపు 43 వేల మంది సిబ్బంది శ్రమకు దక్కిన గౌరవం ఇదని, ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తోన్న సిబ్బంది శ్రమను గుర్తించి.. వారిని ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయం తీసుకున్నరాష్ట్ర ప్రభుత్వానికి టీఎస్ఆర్టీసీ కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలిపారు.సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ నిర్ణయంతో సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి, ప్రజా రవాణా వ్యవస్థను తెలంగాణలో మరింతగా ప్రజలకు చేరువ చేస్తారని ఆశిస్తూనంటూ ట్విట్ చేసారు సజ్జనార్.(

# తెలంగాణ ప్రజలకు ఎన్నికల తాయిలం

## పథకాలు..ప్రకటనలతో మభ్యపెట్టే యత్నం

**- వ్యతిరేకతను దూరం చేసుకునేందుకే ఆర్టీసీ విలీనం**

**- జర్నలిస్టుల సొసైటీ స్థలంపై సుప్రీం తీర్పు బేఖాతరు**

హైదరాబాద్,ఆగస్ట్1 :
మరో మూడు నెలల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు అప్పుడే కసరత్తు మొదలయ్యింది. అధికార పార్టీ ఓట్లు దండుకునే క్రమంలో తనముందున్న అనేక పథకాలను వదులుతోంది. అన్ని వర్గాల ప్రజలను మచ్చిక చేసుకునే క్రమంలో ప్రణాళికాబద్దంగా కెసిఆర్ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే ఆర్టీసీని ప్రబుత్వంలో విలీనం చేయడం, మెట్రోలను విస్తరించడం, స్కైవేలను నిర్మించడం వంటి భారీ ప్రణాళికలను ప్రకటించారు. ఎన్నికల షెడ్యూలు కూడా కొన్ని నెలల్లోనే విడుదల కానున్న దృష్ట్యా.. రాబోయే సమావేశంలో మిగిలిన పలు ప్రజాకర్షక అంశాలపై నిర్ణయాలు ఉంటాయని తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటీవల ఏ కార్యక్రమం చేపట్టినా, ఎటువంటి ప్రకటనలు చేసినా.. ఎన్నికల కోసమే అన్నట్లుగా నిర్ణయాలు ఉంటున్నాయి. బిసిలకు, మైనార్టీలకు లక్ష ఆర్థిక సాయం కొనసాగుతోంది. ఇలాంటి నిర్ణయాలు ముమ్మందు మరిన్ని తీసుకునే అవకావం ఉంది. సోమవారం రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలన్నీ కూడా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే ప్రతిపాదించారని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 43 వేల మందికి పైగా ఆర్టీసీ కార్మికుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తొలగించు కోవాలన్న ఉద్దేశంతో వారిని ప్రభుత్వంలోకి విలీనం చేసే నిర్ణయాన్ని తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశంలో దాదాపు రెండున్నర గంటలపాటు ఆర్టీసీ అంశంపైనే చర్చించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆర్టీసీ సిబ్బంది అంతా ఇకపై ప్రభుత్వ ఉద్యోగులేనని ప్రకటించారు. అయితే వీరికోసం ప్రభుత్వంలో ప్రజా రావాణా శాఖను ప్రత్యేకంగా ఏర్పాటుచేసి.. ఆ శాఖ కిందకు వీరిని తెచ్చి ఆ శాఖ నుంచే వీరికి జీతభత్యాలు చెల్లించడంతో
పాటు ఇతర అంశాలను పర్యవేక్షిస్తారు. ఇందుకు సంబంధించి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. అయితే ఆర్టీసీ కార్పొరేషన్‌ను మాత్రం యథావిధిగా కొనసాగించనున్నారు. ఉద్యోగులు మాత్రం ప్రభుత్వంలో విలీనమవుతారు. ఇదంతా జరగడానికి ఓ ఐదారునెలల సమయం పట్టవచ్చు. అప్పటికి ఎన్నికలు పూర్తి అవుతాయి. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులకు దీర్ఘకాలంగా బకాయిపడిన సీసీఎస్ నిధులు రూ.1150 కోట్లు, ఎస్ఆర్‌బీఎస్ కింద రూ.500కోట్లు, ఎస్‌బీటీ రూ.500 కోట్లు, 2013 పీఆర్సీ బకాయి నిధులు సుమారు రూ.500 కోట్లు ఇవ్వాలని కార్మిక సంఘాలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాయి. ఆర్టీసీపై మంత్రివర్గంలో చర్చ సందర్భంగా ఈ విషయాలపైనా పరిశీలన జరిగిందని సమాచారం. అయితే ఇవన్నీ కాకుండా.. ఒక్కసారిగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. ఇక మరో విషయమేమంటే గత 9 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ మెట్రో విస్తరణపై పెద్దగా మాట్లాడలేదు. ఇటీవలే రాయదుర్గ నుంచి శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు కెసిఆర్ శంకుస్థాపన చేశారు. గతంలో శంషాబాద్ వరకు మెట్రో లైన్ విస్తరించనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. ఇప్పుడు కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్, పరిసర ప్రాంతాలోని పలు మార్గాల్లో మెట్రో విస్తరణ చేపట్టనున్నట్లు ప్రకటించిందన్నది అందరికీ తెలుసు. రూ.60 వేల కోట్లతో వివిధ మార్గాల్లో మెట్రో లైన్ ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం జనాకర్షణ పథకంగానే గుర్తించాలి. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల అభ్యర్థులపైనా ఎట్టకేలకు ఈ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్రా సత్యనారాయణ, బీసీ వర్గానికి చెందిన దాసోజు శ్రవణ్‌లను ఎంపికచేశారు. ఇటీవల బిసి మంత్రం జపం చేస్తున్న బిఆర్ఎస్ ఈ రకంగా లబ్దిపొందే పనిలో పడిందని గుర్తించాలి. రంగారెడ్డి జిల్లా కోకాపేటలో గతంలో కొందరు జర్నలిస్టులకు కేటాయించిన ఎకరం స్థలాన్ని వారికి అప్పగించాలన్న ప్రతిపాదనను మంత్రి సబిత తీసుకురాగా.. మంత్రివర్గం దానికి కూడా ఆమోదం తెలిపింది. అయితే జర్నలిస్టులకు వైఎస్ ప్రభుత్వం కేటాయించిన పేటబషీరాబాద్ స్థలం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అప్పగించడం లేదు. గతేడాది ఆగస్టులో తీర్పు వస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూలత కానరావడం లేదు. కొత్తగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పినా 9 ఏళ్లుగా ఎలాంటి నిర్ణం ప్రకటించడం లేదు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగు ణంగా ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చినా ఎందుకనో సమస్య పరిష్కారంపై కిమ్మనడం లేదు. పలుమార్లు జర్నలిస్ట్ సంఘాలు కలిసి విన్నివించినా సుప్రీం తీర్పును అమలు చేయడంలో విఫలం అవుతున్నారు. దీనిపై సుప్రీంలో కంటెప్ట్ వేయాలన్న డిమాండ్ వచ్చింది. ఇకపోతే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పే రివిజన్ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి, బకాయి ఉన్న డీఏల చెల్లింపు, పాత పింఛను పథకం పునరుద్ధరణ తదితర అంశాలపై మంత్రివర్గంలో కీలక నిర్ణయం తీసుకుంటారని ఉద్యోగ సంఘాలు భావించాయి. అయితే ఆ విషయాలేవీ ప్రస్తావనకు రాలేదు. దీనిపై కొన్ని ఉద్యోగ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. మరోవైపు ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలోనే మరోసారి మంత్రివర్గ సమావేశం నిర్వహిం చాలనే ఉద్దేశంతో ఉన్నారు. రెండు వారాల్లోనే ఈ మంత్రివర్గ సమావేశం ఉండనుంది. అప్పుడు దీనిపై నిర్ణయం తీసుకోవచ్చు. దశలవారీగా నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు.